క్లుప్తంగా

కమ్యూనిటీ భవన స్థలం కబ్జా

జగదేవ్‌పూర్(గజ్వేల్): దళితుల కమ్యూనిటీ భవనం స్థలం కబ్జా చేసిన ఆక్రమణదారుడిని సోమవారం జగదేవ్‌పూర్ మండలం తిగుల్ గ్రామంలోని కాలనీ వాసులు నిలదీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1982లో దళితులకు గ్రామ కంఠంకు సంబంధించిన భూమిని అప్పటి ప్రభుత్వం ఇళ్ల స్థలాల కోసం ఇచ్చిందన్నారు. నాలుగు గుంటల భూమిని కమ్యూనిటీ భవనం కోసం ఉండగా ఇటీవల కాలనీకి చెందిన మహేశ్ అక్రమంగా కబ్జా చేసి పంచాయతీ రికార్డులో మోటేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రామస్వామి, ఆంజనేయులు, మల్లేశం, నర్సయ్య, మల్లయ్య, ఉపేందర్, నాగరాజు పాల్గొన్నారు.

వ్యాధుల విజృంభణ

12 మందికి జ్వరం



పరీక్షలు చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

గజ్వేల్‌రూరల్: వర్షా కాలంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తుండటంతో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీతో పాటు పల్లెజనం జ్వరాలబారిన పడుతున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు స్థానిక వైద్యులతో చికిత్స చేయించుకున్నప్పటికీ తగ్గకపోవడంతో మెరుగైన వైద్యం కోసం గజ్వేల్‌లోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి జ్వరం లక్షణాలతో బాధపడుతున్న వారు 20 మందికిపైగా వచ్చారు. వారికి రక్త పరీక్షలు నిర్వహించగా 12 మంది జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించిన వైద్యులు మెరుగైన చికిత్సను అందించారు. కాగా నిత్యం సుమారు 150 మంది వరకు జ్వరం లక్షణాలతో బాధపడుతున్నవారు ఆస్పత్రికి వస్తుండగా అందలో 10–20 మంది వరకు హాస్పిటల్‌లో అడ్మిట్ అయ్యి చికిత్స పొందుతున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాయికిరణ్ తెలిపారు.

వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు కల్పించాలి



మాట్లాడుతున్న వీఆర్‌ఏలు

సిద్దిపేటకమాన్: జీఓ నంబర్ 81, 85 ప్రకారం 61 ఏళ్లు నిండిన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు కల్పించాలని వారసత్వ వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజలింగం ప్రభుత్వాన్ని కోరారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ..తమకు ఉద్యోగాలు కల్పిస్తామని మాట ఇచ్చి ఏడాది గడుస్తున్నా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టలేదని అన్నారు. ఇప్పటికైనా నూతన ప్రభుత్వం స్పందించి ఉద్యోగాలు కల్పించి తమ జీవితాల్లో వెలుగులు నింపాలన్నారు. సమావేశంలో వివిధ మండలాల 61ఏళ్లు నిండిన వీఆర్‌ఏలు వెంకటస్వామి, సత్యం, మహేశ్, సంతోశ్‌కుమార్, బాలరాజు, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణ

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని మీర్జాపూర్‌లో ఉన్న సర్వే నంబర్ 384లో ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేశారని కాంగ్రెస్ నాయకుడు బందెల హరీశ్ ఆరోపించారు. సోమవారం ఆయన.. కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రైతుల పంట పొలాలకు ఉపయోగపడే కుంట శిఖం భూములను కొందరు అక్రమంగా ఆక్రమించి కుంటలకు గండ్లు పెడుతున్నారని ఆరోపించారు. రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదన్నారు. కలెక్టర్ స్పంచింది కబ్జాదారుల బారి నుంచి ఈ భూములకు రక్షించాలని డిమాండ్ చేశాడు.

చైతన్య దీక్షకు తరలిరండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వెన్న రాజు తదితరులు

హుస్నాబాద్‌రూరల్: మాలల సామాజిక సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 7, 8, 9న ఢిల్లీలో చేపడుతున్న చైతన్య దీక్షను విజయవంతం చేయాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి వెన్న రాజు అన్నారు. సోమవారం మాల పల్లెలో చలో ఢిల్లీ చైతన్య దీక్షల కరపత్రం ఆవిష్కరించారు. మాలలు సామాజికంగా అణచి వేయబడుతున్నారన్నారు. మన హక్కులను సాధించుకోవడానికి మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్ ఆధ్వర్యంలో దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. సిద్దిపేట జిల్లా నుంచి యువత, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నాలని కోరారు.



చిన్నకోడూరు నుంచి అల్లీపూర్ రోడ్డు దుస్థితి



చిన్నకోడూరు నుంచి రాముసిపట్ల రోడ్డు

రహదారులు అధ్వానం

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి చిన్నకోడూరు మండలంలోని రహదారులన్నీ అధ్వానంగా మారాయి. బీటీ రోడ్లపై ఏర్పడిన గుంతల్లో నీరు నిలిచింది. చిత్తడిగా మారిన ఈ దారుల్లో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ బురద రోడ్లలో ప్రజలు నడవటానికి సైతం ఇబ్బందికి గురవుతున్నారు. ఇప్పటికైనా వాటన్నింటికి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

చిన్నకోడూరు(సిద్దిపేట)

కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా..

శేరిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

- ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ
- వారానికి రెండుసార్లు యోగా, క్రీడలు



పాఠ్యాంశాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

దుబ్బాకటౌన్: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించడానికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోంది. ఉపాధ్యాయుల శ్రమ, విద్యార్థుల పట్టుదలతో మాత్రమే ప్రభుత్వం లక్ష్యం నెరవేరుతుంది. దీనికి దౌల్తాబాద్ మండలం శేరిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నిదర్శనంగా నిలుస్తుంది. ఈ పాఠశాలలో ప్రస్తుతం దాదాపు 120 మంది స్టూడెంట్లు విద్యనభ్యసిస్తున్నారు. నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారు.

ఏటా 40 మందికి అడ్మిషన్లు

దౌల్తాబాద్ మండల కేంద్రంలో దాదాపు 3 ప్రైవేటు పాఠశాలలున్నాయి. కానీ శేరిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 4 సంవత్సరాల నుంచి యేటా 40 మంది నూతన విద్యార్థుల కొత్తగా చేరుతుంటారు. ప్రతీ విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపడం వల్లే ఇది సాధ్యమవుతోంది. ప్రస్తుతం ఈ పాఠశాలలో 1–5వ తరగతిలో 120 మంది విద్యార్థుల్లో 60 మందే దౌల్తాబాద్ నుంచి వస్తున్నారు. అలాగే పలు గ్రామాల నుంచి 20 మంది వస్తున్నారు.

వాట్సాప్ గ్రూప్‌లు

సెలవు రోజుల్లో విద్యార్థులకు హోం వర్క్ ఇవ్వడానికి ఉపాధ్యాయులు పాఠశాలలో తరగతుల వారీగా వాట్సాప్ గ్రూప్‌లను ఏర్పాటు చేశారు. పచ్చని చెట్లు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యనందిస్తున్నారు. వారానికి 2 సార్లు యోగా కార్యక్రమాలు, క్రీడా తరగతులను నిర్వహిస్తున్నారు.

ప్రతీ నెల పేరెంట్స్ మీటింగ్

ఉపాధ్యాయులు ప్రతి నెలా పేరెంట్స్ మీటింగ్ నిర్వహిస్తున్నారు. విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు, ప్రగతిని, వారు చేస్తున్న తప్పిదాలను తల్లిదండ్రులకు తెలియజేస్తున్నారు.

ఎప్పటికప్పుడు సందేహాలు నివృత్తి



నేను ఈ పాఠశాలలో 5 సంవత్సరాల నుంచి విద్యనభ్యసిస్తున్నా. నేను దౌల్తాబాద్ నుంచి ఈ పాఠశాలకు వస్తా. తరగతి గదిలో మాకు ఏ సబ్జెక్ట్‌లో సందేహాలు వచ్చినా ఉపాధ్యాయులు వెంటనే నివృత్తి చేస్తున్నారు. మాకు ఆలోచనల ఆధారంగా అభ్యాసన కృత్యాలు నిర్వహిస్తున్నారు. నేను ప్రతీ సబ్జెక్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చడానికి మా ఉపాధ్యాయులే కారణం.

- సృజన, 5వ తరగతి విద్యార్థి

సమష్టి కృషి



ఉపాధ్యాయుల సమష్టి కృషి, తల్లిదండ్రుల సహకారంతో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్నాం. విద్యార్థులకు బోధనతో పాటు బోధనేతర కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నాం. ప్రతీ తరగతి గదిలో 90 శాతం మంది విద్యార్థులు ప్రతీ సబ్జెక్ట్‌లో రాయడం, చదవడంతో పాటు చతుర్విద ప్రక్రియలు చేయగల్గుతున్నారు.

-విష్ణువర్ధన్ రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం

డీఏలు వెంటనే విడుదల చేయాలి

టీపీయూఎస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనాకర్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల డీఎలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పబ్బతి శ్రీనాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆయన సోమవారం మాట్లాడారు. ఉద్యోగులకు ఆరు నెలలకు ఒకసారి రావాల్సిన డీఎలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ప్రభుత్వం తాత్సారం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పాఠశాలల్లో స్కావేంజర్లు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఐదేళ్లకోసారి ఇవ్వాల్సిన పీఆర్సీని ఇవ్వకుండా కాలయాపన చేయడం తగదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి 40 శాతానికి తగ్గకుండా ఫిట్‌మెంట్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యోగ ఉపాధ్యాయులతో కలిసి తాము ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీపీయూఎస్ జిల్లా కార్యదర్శి మురళీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి సాయం

చిన్నకోదూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామంచకు చెందిన నిరుపేద కుచ్చల కిషన్ అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని ఫార్మర్స్ ఫస్టు ఫౌండేషన్ చైర్మన్ చక్రధర్ గౌడ్ సోమవారం ఫోన్‌లో పరామర్శించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి పల్లె రాజు ద్వారా ఆ కుటుంబానికి క్వింటాలు బియ్యం, నగదు అందజేశారు. పేద కుటుంబానికి అండగా ఉంటానని వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భూమ్‌రెడ్డి, సుధాకర్, ఎల్లారెడ్డి, మల్లేశం, శంకర్, సంతోశ్, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

శిథిలావస్థలో పశువైద్య ఉపకేంద్రం

పెచ్చులూడుతున్న శ్లాబు | కనీస సౌకర్యాల కొరత | పట్టించుకోని అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): పశువుల ఉపకేంద్రం భవనం 1985లో నిర్మించగా ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. ఇప్పుడు పెచ్చులు ఊడుతున్నాయి. ఏ క్షణంలో ఏ మూల కూలుతుందోనని భయం భయంగా సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఒక జూనియర్ వెటర్నీర్ ఆఫీసర్ కచ్చితంగా ఉండాలి కానీ డిప్యుటేషన్‌పై ఒకర్ని కేటాయించారు. అయితే ఉప కేంద్రం పరిధిలో అక్కన్నపేట, అంతక్కపేట, గొల్లకుంట, పంతుల్‌తండా, మైసమ్మవాగుతండా, కుందనవానిపల్లి, కేశనాయక్‌తండా గ్రామాల రైతులకు సంబంధించిన పశువులకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో అక్కన్నపేటలో పశువైద్య ఉపకేంద్రాన్ని నిర్మించారు. ఇక్కడ సిబ్బంది ఉన్నప్పటికీ సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల సిబ్బంది అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పశువైద్య ఉప కేంద్రం పరిధిలో ఆవులు 1,507, గేదెలు 1,206, గొర్రెలు 5,120, మేకలు 1,500 వరకు ఉన్నాయి. ప్రస్తుతం పెంపకందారులు, రైతులు పశువైద్య కేంద్రానికి జీవాలను తీసుకురావటానికి జంకుతున్నారు. ఇక్కడ 10 నెలలుగా డిప్యూటేషన్‌పై ఓ జూనియర్ వెటర్నీర్ ఆఫీసర్‌ను నియమించి చేతులు దులుపుకొన్నారు. ఒక అటెండర్ విధులు నిర్వహిస్తున్నారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా రైతుల వద్దకే వెళ్లి పశువులకు వైద్యసేవలను అధికారి అందిస్తున్నారు. కాగా, నూతన భవన నిర్మాణానికి త్వరగా నిధులు మంజూరు చేయాలని పాడి రైతులు కోరుతున్నారు.



శిథిలావస్థలో పశువైద్య ఉపకేంద్రం భవనం

ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం

శిథిలావస్థలో ఉన్న భవనంలో భయం భయంగా విధులు నిర్వర్తిస్తున్నాం. భవనం పైనుంచి పెచ్చులు ఊడుతున్నాయి. ఎప్పుడు ఏ మూల కూలిపోతుందోననే భయమేస్తోంది. నూతన భవనం త్వరగా మంజూరు చేయాలని జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు ఇచ్చాం.

- యాకుబ్ అలీ, జూనియర్ వెటర్నీర్ ఆఫీసర్, అక్కన్నపేట

ఘనంగా బోనాలు



బోనాలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు

మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో బోనాల పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలు పోతరాజు, శివసత్తుల వేషధారణలతో బోనాలు తలపై పెట్టుకొని సందడి చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాఠశాల స్పెషల్ ఆఫీసర్ స్వప్న మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్న బోనాల పండుగ విశిష్టతను పిల్లలకు తెలియజేయాలనే సదుద్దేశంతో పాఠశాలలో ఈ పండుగను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనం

దుబ్బాకటౌన్: మున్సిపల్ పరిధిలోని లచ్చపేట జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి 2005–06 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆటపాటలతో సంతోషంగా గడిపారు.


సంక్షిప్త వార్తలు

◆ **సైబర్ నేరాలపై అప్రమత్తం**



అక్కన్నపేట(హుస్నాబాద్): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండి, డయల్ 100పై కూడా అవగాహన కలిగి ఉండాలని ఎస్సై విజయ్‌భాస్కర్ అన్నారు. మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ ఆవరణంలో సోమవారం సైబర్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు పోలీసుల సాయం పొందాల్సి వస్తే, వెంటనే డయల్–100కు కాల్ చేయాలని చెప్పారు. అపరిచితుల నుంచి ఎస్‌ఎంఎస్, ఈ మెయిల్, వాట్సప్‌ల ద్వారా వచ్చే బ్లూ కలర్ లింక్స్‌ను క్లిక్ చేస్తే, మొబైల్‌లోని డేటా మొత్తం సైబర్ నేరగాళ్ల వద్దకు పోతుందని హెచ్చరించారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ త్యాగరాజు, కృష్ణనాయక్, హోంగార్డు శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

◆ **సినారె రచనలు ఆదర్శం**



కోహెడరూరల్(హుస్నాబాద్): డాక్టర్ సీ నారాయణ రెడ్డి(సినారె) రచనలు నేటి యువతకు ఆదర్శమని సామాజిక కార్యకర్త పిడిశెట్టి రాజు అన్నారు. సోమవారం మండలంలోని గుండారెడ్డిపల్లి సిద్దప్ప వరకవి ఆశ్రమంలో సినారె 93వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రాపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లుర్పించారు. సామాన్య కుటుంబంలో జన్మించిన సినారె తన రచనలతో పాటు సినీ గేయాలు రాసి పేరు ప్రఖ్యాతలు పొందారని గుర్తు చేశారు. కార్యక్రమంలో అనంతరం శ్రీనివాస్, భూమయ్య, పి.అద్వీత, అక్షర తదితరులు పాల్గొన్నారు.

◆ **బీజేపీలోకి చేరికలు**



కొమురవెల్లి(సిద్దిపేట): బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి సమక్షంలో మండలానికి చెందిన గొల్లపల్లి మల్లికార్జున్, సార్ల హరీశ్‌లు పార్టీలో సోమవారం చేరారు. ఈ సందర్భంగా ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ఉమారాణి, జిల్లా ఉపాధ్యక్షుడు బూర్గు సురేశ్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి ఎక్కలదేవి మధు, బీజేవైఎం మండల అధ్యక్షుడు సనాది కరుణాకర్, కటకం అమరేందర్, మహేశ్, రాజు పాల్గొన్నారు.

◆ **విధుల్లో అప్రమత్తం తప్పనిసరి**

గజ్వేల్‌రూరల్: విధుల్లో ఉన్న డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని, ప్రయాణికులను సురక్షితంగా చేర్చే బాధ్యత డ్రైవర్లపైనే ఉందని గజ్వేల్ ఎస్ఐ యాదగిరిరెడ్డి పేర్కొన్నారు. జీపీపీ(గజ్వేల్–ప్రజ్ఞాపూర్) ఆర్టీసీ డిపోలో రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిత్యం వేలాది మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తుంటారన్నారు. డ్రైవర్లు బస్సు నడిపే సమయంలో ఏకాగ్రతతో ఉండాలన్నారు. సురక్షితంగా ప్రయాణికులను గమ్య స్థానాలకు చేర్చాలని సూచించారు. ప్రమాదాలు జగరకుండా విధులు నిర్వహించిన కే రాములు, ఎస్‌కే మసూద్‌మీరా, ఏ నర్సింహులులను ఉత్తమ డ్రైవర్లుగా అభినందిస్తూ ప్రశంసాపత్రాలు, బెస్ట్ ఆయిల్ సేఫ్ డ్రైవర్‌గా కిష్టయ్య, డీబీరెడ్డిలను నగదు అవార్డుతో సన్మానించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ పవన్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

◆ **ఆలయ అభివృద్ధికి కృషి**

మద్దూరు(హుస్నాబాద్): రామలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని పీసీసీ అధికార ప్రతినిధి మొగ్గుళ్ల రాజిరెడ్డి అన్నారు. సోమవారం బెక్కల్‌లో ఉన్న ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామలింగేశ్వరస్వామి ఆలయం ప్రాచీన ఆలయంగా ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. దానికి పూర్వవైభవం తీసుకొచ్చేలా తన వంతుగా సహకారాన్ని అందిస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కూకట్ల బాలరాజు యాదవ్, బండి శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ **ఘనంగా పల్లకీ సేవ**



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): స్థానిక ఉమాపార్థీశ్వర కోటిలింగేశ్వర ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలలో భాగంగా ఉదయం నుంచి ఆలయంలో భక్తులు అభిషేకాలు, అన్న ప్రసాద సేవాలు తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో స్వామి వారి పల్లకీ సేవ నిర్వహించారు. దీంతో ఆలయ ప్రాంగణం ఓం నమః శివాయ నామస్మరణతో మార్మోగింది. కార్యక్రమంలో భక్తులు, ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

◆ **పాలనలో ప్రభుత్వం విఫలం**

చిన్నకోదూరు(సిద్దిపేట): పాలనలో ప్రభుత్వం విఫలమైందని మాజీ వైస్ ఎంపీపీ కీసరి పాపయ్య, బీఆర్ఎస్ నాయకులు జంగిటి శ్రీనివాస్‌లు ఆరోపించారు. సోమవారం వారు మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలు అమలయ్యే పరిస్థితి కనబడటం లేదన్నారు. ఇచ్చిన హామీలు నెరవేరాల్సి ఉండగా ఇది వదిలేసి మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌లను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. విమర్శలు మానుకొని ప్రజా పాలనపై దృష్టి సారించాలని హితవుపలికారు. ఆంక్షలు లేకుండా రూ.2 లక్షలు రైతులందరికీ రుణ మాఫీ చేయాలన్నారు.

◆ **పరామర్శ**

మద్దూరు(హుస్నాబాద్): తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు డీ రవీందర్ మండలంలోని వంగపల్లి రేషన్ డీలర్ సీహెచ్ జయరావు మరణించడంతో అంత్యక్రియలకు హాజరై బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

◆ **ఇసుక ట్రాక్టర్ స్వాధీనం**

చేర్యాల(సిద్దిపేట): అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ దామోదర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, పట్టణ శివారు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఏఎస్ఐ నవీన్ కుమార్, సిబ్బందితో కలిసి ఆయన వెళ్లి ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తెలిపారు.

◆ **కేసుల ఛేదనలో సీసీ కెమెరాలు కీలకం**

కోహెడరూరల్(హుస్నాబాద్): నేరాల నియంత్రణ, కేసుల ఛేదనలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని ఎస్ఐ తిరుపతి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నేరాల నియంత్రణ, శాంతి భద్రతలు కాపాడేందుకు ఎంతగానో దోహదపడుతాయన్నారు. ప్రతి గ్రామంలో వాటిని ఏర్పాటు చేసుకోవాలన్నారు.

◆ **బాధిత కుటుంబానికి చేయూత**



గజ్వేల్‌రూరల్: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడగా ఆ కుటుంబానికి చెలిమి ఫౌండేషన్ చేయూత అందించింది. మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డుకు చెందిన పసుల స్వామికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. అతను ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కాగా, ఆర్థిక ఇబ్బందులతో ఇటీవల ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం విషయం తెలుసుకున్న చెలిమి ఫౌండేషన్ సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.3,500 విలువైన నిత్యావసరాలు, రూ.1,1500 నగదు అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు తులసీదాస్, కోశాధికారి ఆనంద్, సభ్యులు నర్సింహులు, శ్రీనివాస్, ఆంజనేయులు, ప్రదీప్‌కుమార్, రమేశ్, కృష్ణ, చిందం సుభాశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ **మొక్కలు నాటి సంరక్షించాలి**

కౌడిపల్లి(నర్సాపూర్): వన మహోత్సవంలో భాగంగా సోమవారం మండలంలోని వెల్మకన్న, కొట్టాల, లింగంపల్లి గ్రామాల్లో గ్రామస్తులతో కలిసి ఎక్సైజ్ అధికారులు ఈత మొక్కలు నాటారు. వెల్మకన్న అమ్మక చెరువు కట్టపై ఎక్సైజ్ ఎస్ఐ రాఘవేందర్ రావు, మాజీ సర్పంచ్ రాజేందర్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి తదితరులు మొక్కలు నాటారు. గ్రామాల్లో స్వచ్ఛమైన కల్లు కోసం ఈత మొక్కలు నాటి సంరక్షించాలని తెలిపారు. దీంతో పాటు కొట్టాల, లింగంపల్లి గ్రామాల్లో ఈత మొక్కలు నాటారు. కార్యక్ర మంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

